క్లుప్తంగా

అంతర్వేది ఆలయంలో పూజలు



స్వామివారి సన్నిధిలో ఎమ్మెల్యే రాపాక

సఖినేటిపల్లి: అంతర్వేది లక్ష్మీనృసింహుని ఆలయంలో స్వామివారికి రాజోలు ఎమ్మెల్యే రాపాక వరప్రసాదరావు గురువారం ప్రత్యేక పూజలు చేశారు. అర్చకులు ఆయనకు ఆలయ మర్యాదలతో స్వాగతం పలికారు. పూజల అనంతరం ప్రధాన అర్చకుడు పాణింగిపల్లి శ్రీనివాస కిరణ్ ఆధ్వర్యాన ఎమ్మెల్యే రాపాకను అర్చకులు ఆశీర్వదించారు. స్వామివారి ప్రసాదాన్ని సూపరింటెండెంట్ పి.విజయ సారథి అందజేశారు.

సీతారామాలయానికి రూ.10 లక్షలు



ఆలయ కమిటీ సభ్యులకు టీటీడీ చెక్కును అందిస్తున్న ఎమ్మెల్యే చిట్టిబాబు

అంబాజీపేట: పుల్లేటికుర్రు శివారు కొప్పిశెట్టి వారిపాలెంలోని శ్రీ సీతారామ ఆలయానికి తిరుమల తిరుపతి దేవస్థానం నుంచి రూ.10 లక్షలు మంజూరయ్యాయి. ఆలయ కమిటీ చైర్మన్ కొప్పిశెట్టి ఆనంద వెంకట ప్రసాద్, సభ్యులు ఈ విషయం తెలిపారు. తొలి విడతగా రూ.3,26,972 చెక్కును ఎమ్మెల్యే కొండేటి చిట్టిబాబు చేతుల మీదుగా ఆయన క్యాంపు కార్యాలయంలో ఆలయ కమిటీకి గురువారం అందజేశారు. ఈ సందర్భంగా కమిటీ సభ్యులు మాట్లాడుతూ, ఆలయ నిర్మాణానికి అవసరమైన నిధుల సాధనకు ఎమ్మెల్యే తన వంతు కృషి చేశారంటూ అభినందనలు తెలిపారు. ఆయనను సత్కరించారు. కార్యక్రమంలో ఈఓ బొక్కా వెంకటేశ్వరరావు, కమిటీ సభ్యులు కొప్పిశెట్టి వెంకటేశ్వరరావు, సానబోయిన సత్యనారాయణ, కొప్పిశెట్టి వీర వెంకట సత్యనారాయణ పాల్గొన్నారు.

ఆయుష్మాన్ భారత్ కార్డుల పంపిణీ



పినపళ్లలో ఆయుష్మాన్ భారత్ కార్డులు పంపిణీ చేస్తున్న వైద్య, ఆరోగ్య సిబ్బంది

ఆలమూరు: మండలంలోని వివిధ గ్రామాల్లో ఆయుష్మాన్ భారత్ కార్డుల కార్డుల పంపిణీ శరవేగంగా జరుగుతుంది. పెదపళ్ల, చొప్పెల్ల పీహెచ్సీల అధికారులు పి.భవానీ శంకర్, డి.మల్లికార్జున ఆధ్వర్యాన వైద్య, ఆరోగ్య, ఆశ సిబ్బంది తొలి విడతగా మంజూరైన 1,728 కార్డులను లబ్ధిదారులకు గురువారం అందజేశారు. ఈ కార్డు ద్వారా కార్పొరేట్ స్థాయి ఆస్పత్రుల్లో రూ.5 లక్షల వరకూ ఉచిత వైద్య సేవలు పొందవచ్చనని తెలిపారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు ప్రతిష్టాత్మకంగా చేపట్టిన ఆయుష్మాన్ భారత్ పథకాన్ని సద్వినియోగం చేసుకోవాలని విజ్ఞప్తి చేశారు. సీహెచ్ఓ పి.రాధాకృష్ణ పాల్గొన్నారు.

వైఎస్సార్ సీపీ మండల కన్వీనర్‌గా కనుమూరి



ఆత్రేయపురం: ఆవిర్భావం నుంచీ వైఎస్సార్ సీపీ మండల కన్వీనర్‌గా పని చేస్తున్న కనుమూరి శ్రీనివాసరాజు మరోసారి ఆ పదవికి ఎంపికయ్యారు. ఈ మేరకు గురువారం ఉత్తర్వులు జారీ అయ్యాయని ఆయన తెలిపారు. తనకు మరోసారి ఈ పదవి ఇచ్చిన వైఎస్సార్ సీపీ అధినేత, ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్ రెడ్డికి, కొత్తపేట ఎమ్మెల్యే, ప్రభుత్వ విప్ చిర్ల జగ్గిరెడ్డికి కనుమూరి కృతజ్ఞతలు తెలిపారు.

నేడు సొసైటీ మహాజన సభ

అంబాజీపేట: స్థానిక సొసైటీ మహాజన సభ శుక్రవారం మధ్యాహ్నం 3 గంటలకు నిర్వహిస్తున్నారు. సొసైటీ సీఈఓ కుపంట్ల అయ్యప్పనాయుడు గురువారం ఈ విషయం తెలిపారు. చైర్‌పర్సన్ దొమ్మేటి సత్య మోహన్ అధ్యక్షతన జరిగే ఈ సభకు సొసైటీ పరిధిలోని రైతులందరూ హాజరు కావాలని కోరారు. జమా ఖర్చులు, వైదొలగిన సభ్యులను ఆమోదించడం, ఆడిట్ రిపోర్టు తదితర అంశాలపై సభలో చర్చిస్తారని తెలిపారు.

1న కుమ్మరి శాలివాహన సంఘ సమావేశం

అంబాజీపేట: కోనసీమ కుమ్మరి శాలివాహన సంక్షేమ సంఘ సమావేశం వచ్చే నెల ఒకటో తేదీన నిర్వహిస్తున్నారు. మాచవరంలోని ఉన్న కుమ్మర శాలివాహన సంఘ భవనంలో ఉదయం 9 గంటలకు ఈ సమావేశం జరుగుతుందని సంఘ నాయకులు గురువారం తెలిపారు. జిల్లాలోని కుమ్మరి శాలివాహనులందరూ ఇందులో పాల్గొంటారన్నారు. ఈ సమావేశంలో జిల్లా, డివిజన్, మండల కమిటీల ఏర్పాటు, సంఘాభివృద్ధిపై చర్చిస్తామని తెలిపారు.

బైబై గణేశా..

- రెండో రోజూ కొనసాగిన నిమజ్జనాలు
- గంగమ్మ ఒడికి చేరిన గజాననుడు
- ఉత్సాహంగా ఊరేగింపులు

మామిడికుదురు/పి.గన్నవరం/అంబాజీపేట/అయినవిల్లి/కొత్తపేట/ఆలమూరు/మలికిపురం: నవరాత్ర ఉత్సవాల్లో తొమ్మిది రోజుల పాటు ఘనంగా పూజించిన అనంతరం వినాయకుడిని ఆ స్వామిని.. పినతల్లి గంగమ్మ ఒడికి భక్తులు చేర్చారు. ఈ సందర్భంగా వరుసగా రెండో రోజైన గురువారం కూడా గణేశ నిమజ్జనోత్సవాలు ఘనంగా నిర్వహించారు. స్వామివారి విగ్రహాలను వైభవంగా ఊరేగించి, నదులు, కాలువల్లో నిమజ్జనం చేశారు. రాజోలు మండలం తాటిపాకలోని నగరం రోడ్డులో ఆటో యూనియన్ ఆధ్వర్యాన ఏర్పాటు చేసిన గణేశుని విగ్రహాన్ని భక్తుల కోలాహలం, బాణసంచా కాల్పుల నడుమ నగరం, మామిడికుదురు, పాశర్లపూడి గ్రామాల మీదుగా ఘనంగా ఊరేగించారు. పాశర్లపూడి బాడవలోని వైనతేయ గోదావరి నదిలో నిమజ్జనం చేశారు. పెదపట్నంలంకలో ఏర్పాటు చేసిన విగ్రహాన్ని విచిత్ర వేషధారణలు, బాణసంచా కాల్పులు, తీన్‌మార్ నృత్యాల నడుమ ఘనంగా ఊరేగించి, వైనతేయ గోదావరిలో నిమజ్జనం చేశారు.

- పి.గన్నవరం మండలం నాగుల్లంక శివారు చినరామాలయం వీధిలో ఏర్పాటు చేసిన శ్రీ బాల గణపతి స్వామివారిని గ్రామంలో ఊరేగించి రాయిలంక వద్ద వశిష్ఠ గోదావరిలో నిమజ్జనం చేశారు. గణపతి బొప్పా మోరియా అంటూ మహిళలు, చిన్నారులు నినాదాలు చేశారు. పోతవరం గ్రామంలో సర్పంచ్ వడలి కొండయ్య ఆధ్వర్యాన భక్తులకు పెద్ద ఎత్తున అన్న సమారాధన చేశారు. ప్రత్యేక పూజల అనంతరం, స్వామి వారి నిమజ్జనోత్సవం కోలాహలంగా నిర్వహించారు. ఎల్.గన్నవరం లాకు వద్ద యర్రంశెట్టి సోదరుల ఆధ్వర్యాన భక్తులకు అన్న సమారాధన చేశారు.
- అంబాజీపేట మండలంలోని పలు గ్రామాల్లో ఏర్పాటు చేసిన మండపాల వద్ద గణపతికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. కె.పెదపూడి కుడుపూడివారిపాలెం, నందంపూడి అమ్మవారితోట, అంబాజీపేట కొర్లపాటివారిపాలెల్లో గణేశునికి ప్రత్యేక పూజలు చేసి, వాహనాలపై వైభవంగా ఊరేగించి.. యువకుల కేరింతల నడుమ ఘనంగా నిమజ్జనం చేశారు. గంగలకుర్రు శివారు గుంటమామిడితోట లక్ష్మీ గణపతి ఆలయం వద్ద 18వ వార్షికోత్సవం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా స్వామి వారి లడ్డూను మామిడిశెట్టి శ్రీనివాసరావు కుమారుడు మణికుమార్, సంధ్య దంపతులు రూ.19,200కు వేలంలో దక్కించుకున్నారు.
- అయినవిల్లి, తొత్తరమూడి, విలస, వీరవల్లిపాలెం తదితర గ్రామాల్లో వినాయకుని నిమజ్జనోత్సవాలు ఘనంగా నిర్వహించారు. అయినవిల్లి రావులమ్మ ఆలయం వద్ద, ముక్తేశ్వరం పాలెంలో విఘ్నేశ్వరుని ఆలయం వద్ద భారీగా అన్నదానాలు చేశారు.
- కొత్తపేట కళానగర్‌లో వేంచేసియున్న శ్రీ సిద్ధివినాయకస్వామి వారి శాంతి కల్యాణం ప్రతి ఏడాది మాదిరిగానే బుధవారం రాత్రి వైభవంగా నిర్వహించారు. ప్రధానార్చకుడు పుల్లాపంతుల విజయ్‌కుమార్‌శర్మ ఆధ్వర్యాన స్వామివారిని విశేషంగా అలంకరించారు. స్థానిక ప్రముఖులు, పారిశ్రామికవేత్త మంతెన వెంకట కృష్ణంరాజు దంపతుల ఆధ్వర్యాన స్వామివారి శాంతి కల్యాణం జరిపించారు. అనంతరం నిర్వహించిన వేలంలో గణపతి లడ్డూను ప్రముఖ న్యాయవాది గాలిదేవర పుల్లయ్య నాయుడు రూ 38,500కు దక్కించుకున్నారు. గణపతి నవరాత్ర ఉత్సవాల్లో భాగంగా బిళ్లకుర్రు శివారు వాకాడవారిపాలెంలో నిర్వహించిన చిన్నారుల కూచిపూడి నృత్య ప్రదర్శన విశేషంగా అలరించింది. వెంకట్రాయ నాట్య బృందం చిన్నారులు వాకాడ మహేశ్వరి, చిన్ను, కావ్య, కావ్యశ్రీ, డేగల భాను, తిరుమనాదం రాజి, వశిక తదితరులు కూచిపూడి నృత్యం ప్రదర్శించారు. వారి గురువు కోలా రామును గ్రామ పెద్దలు వాకాడ గోవిందరావు తదితరులు సత్కరించారు. అనంతరం నిర్వహించిన వేలంలో గణపతి లడ్డూను పంచాయతీ సభ్యుడు కొండేపూడి గోవిందరాజు రూ.10,500కు దక్కించుకున్నారు. గురువారం భారీగా అన్నసమారాధన నిర్వహించారు.
- ఆలమూరు మండలం సంధిపూడి, పెదపళ్ల, పినపళ్ల, మూలస్థాన అగ్రహారం, చొప్పెల్ల తదితర గ్రామాల్లో నెలకొల్పిన మండపాల్లోని గణనాథుడిని వాహనాలపై ఊరేగింపుగా తీసుకువెళ్లి, గౌతమీ గోదావరి, తూర్పు డెల్టా ప్రధాన కాలువల్లో నిమజ్జనం చేశారు. ఆయా మండపాల వద్ద ఏర్పాటు చేసిన ఆధ్యాత్మిక, సాంస్కృతిక కార్యక్రమాలు భక్తులను అలరించాయి.
- మలికిపురం మండలం మేడిచర్లపాలెం పంచాయతీ ఏరియాలోని వినాయక మండపం వద్ద స్వామివారి చేతిలోని లడ్డూను మేళం భాస్కరరావు కుమారులు వేలంలో రూ.9 వేలకు దక్కించుకున్నారు.



మామిడికుదురులో వినాయకుడి విగ్రహం ఊరేగింపు



నాగుల్లంక వద్ద వశిష్ఠ గోదావరిలో వినాయకుని విగ్రహాలను నిమజ్జనం చేస్తున్న భక్తులు



అంబాజీపేట కేవీ పాలెంలో గణపతిని ఊరేగిస్తున్న యువకులు, స్థానికులు



కొత్తపేట కళానగర్ ఆలయంలో లక్ష్మీగణపతి కల్యాణం నిర్వహిస్తున్న దృశ్యం

జగనన్న ఆరోగ్య సురక్ష సక్సెస్ కావాలి

- ఏమాత్రం అలసత్వం వద్దు
- ఎమ్మెల్యే కొండేటి చిట్టిబాబు

మామిడికుదురు/అయినవిల్లి/అంబాజీపేట/ఆలమూరు: అన్ని శాఖల అధికారులు, సిబ్బంది సమన్వయంతో పని చేసి, జగనన్న ఆరోగ్య సురక్ష కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని పి.గన్నవరం ఎమ్మెల్యే కొండేటి చిట్టిబాబు ఆదేశించారు. ఈ కార్యక్రమం నిర్వహణపై పంచాయతీ కార్యదర్శులు, వివిధ శాఖల అధికారులు, వలంటీర్లకు పాశర్లపూడిలోని శ్రీపాశర్లపూడి సత్రంలో గురువారం అవగాహన సదస్సు ఏర్పాటు చేశారు. ఇందులో పాల్గొన్న చిట్టిబాబు మాట్లాడుతూ, ఇప్పటికే ప్రతి ఇంటికీ వెళ్లి, ఆరోగ్య పరీక్షలు చేసి, వ్యాధులున్న వారిని గుర్తిస్తున్నారని చెప్పారు. వారికి గ్రామాల్లో ఏర్పాటు చేసే మెగా వైద్య శిబిరంలో సేవలందిస్తారని తెలిపారు. జగనన్న ఆరోగ్య సురక్షపై ఎటువంటి అలసత్వం తగదని, ప్రతి ఒక్కరూ వినియోగించుకునేలా చర్యలు తీసుకోవాలని అధికారులకు స్పష్టం చేశారు. కార్యక్రమంలో జెడ్పీటీసీ సభ్యుడు కశిరెడ్డి అంజిబాబు, ఎంపీపీ కుసుమ వనజకుమారి, ఎంపీటీసీల సమాఖ్య అధ్యక్షుడు నెల్లి దుర్గాప్రసాద్, ఎంపీటీసీ సభ్యుడు అంకాని వీరాంజనేయులు, ఎంపీడీఓ కె.వెంకటేశ్వరరావు, డిప్యూటీ తహసీల్దార్ శరణ్య, అప్పనపల్లి దేవస్థానం చైర్మన్ చిట్టూరి రామకృష్ణ, వైఎస్సార్ సీపీ మండల శాఖ అధ్యక్షుడు కొమ్ముల రాము, గ్రామ శాఖ అధ్యక్షుడు చిక్కం బుజ్జిబాబు తదితరులు పాల్గొన్నారు.

- జగనన్న ఆరోగ్య సురక్ష కార్యక్రమాన్ని సద్వినియోగం చేసుకోవాలని ప్రజలకు ఎమ్మెల్యే చిట్టిబాబు విజ్ఞప్తి చేశారు. అయినవిల్లి మండలం సిరిపల్లిలో అధికారులు, వలంటీర్లతో నిర్వహించిన సమావేశంలో ఆయన పాల్గొన్నారు. ఈ నెల 30 నుంచి జరిగే వైద్య శిబిరాల్లో ప్రజలకు ఆరోగ్య సేవలందించాలని చెప్పారు. ఎవ్వరికీ ఎటువంటి ఇబ్బందులూ తలెత్తకుండా నాయకులు, కార్యకర్తలు ఈ కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని కోరారు. వైఎస్సార్ సీపీ మండల అధ్యక్షుడు కుడుపూడి విద్యాసాగర్ అధ్యక్షత వహించారు. అలాగే, మండల పరిషత్ కార్యాలయంలో స్పోర్ట్స్ కిట్ల పంపిణీని ఎమ్మెల్యే చిట్టిబాబు ప్రారంభించారు. కార్యక్రమంలో ఎంపీడీఓ తాడి శ్రీవెంకటాచార్య, ఎంఈఓ జేవీకే దుర్గ, ఎంపీపీ మట్టపర్తి నాగ విజయలక్ష్మి, జెడ్పీటీసీ సభ్యుడు గన్నవరపు శ్రీనివాసరావు, వైస్ ఎంపీపీ బయ్యా ,అయినవిల్లి విఘ్నేశ్వర స్వామి ఆలయ చైర్మన్ గుత్తుల నాగబాబు తదితరులు పాల్గొన్నారు.
- జగనన్న ఆరోగ్య సురక్షతో పేదలకు ఆరోగ్య భరోసా కలుగుతుందని అంబాజీపేట ఎంపీపీ దొమ్మేటి వెంకటేశ్వరరావు, ఎంపీటీసీ సభ్యురాలు విత్తనాల దుర్గాభవాని, సొసైటీ అధ్యక్షుడు మట్టపర్తి చంద్రశేఖర్ అన్నారు. జగనన్న ఆరోగ్య సురక్ష సర్వేను గంగలకుర్రు అగ్రహారంలో వారు ప్రారంభించారు. వలంటీర్లు, ఆరోగ్య సిబ్బంది ఇంటింటికీ వచ్చి కుటుంబంలోని సభ్యులకు బీపీ, షుగర్ తదితర వైద్య పరీక్షలు నిర్వహిస్తారని తెలిపారు. గ్రామంలోని జెడ్పీ హైస్కూల్‌లో వచ్చే నెల 17న నిర్వహించే వైద్య శిబిరాన్ని సద్వినియోగం చేసుకోవాలని కోరారు.
- జగనన్న ఆరోగ్య సురక్ష కార్యక్రమం ద్వారా ఆలమూరు మండలంలోని వివిధ గ్రామాల్లోని ప్రజలకు ఉచిత ఆరోగ్య పరీక్షలు విస్తృతంగా నిర్వహిస్తున్నారు. పెదపళ్ల, చొప్పెల్ల పీహెచ్‌సీల పరిధిలోని వైద్య, ఆరోగ్య సిబ్బంది ఇంటింటికీ వెళ్లి వివిధ వైద్య పరీక్షలు చేస్తున్నారు. అనారోగ్యం బారిన పడిన వివరాలను ఎప్పటికప్పుడు సంబంధిత పీహెచ్‌సీలకు నివేదిస్తున్నారు. ఈ నెల 30 నుంచి ఏర్పాటు చేయనున్న వైద్య శిబిరాల్లో దీర్ఘకాలిక వ్యాధిగ్రస్తులకు ప్రత్యేక వైద్య నిపుణులు వైద్య సేవలు అందజేస్తారని అవగాహన కల్పిస్తున్నారు. ఈ కార్యక్రమాల్లో సీహెచ్ఓ పి.రాధాకృష్ణ తదితరులు పాల్గొంటున్నారు.



పాశర్లపూడిలో జరిగిన సమావేశంలో మాట్లాడుతున్న ఎమ్మెల్యే చిట్టిబాబు



గంగలకుర్రు అగ్రహారంలో ప్రజలకు టోకెన్లు ఇస్తున్న ఎంపీపీ వెంకటేశ్వరరావు



పెనికేరులో వైద్య పరీక్షలు చేస్తున్న ఆరోగ్య సిబ్బంది

నేడు విద్యుత్ సరఫరాకు అంతరాయం

కొత్తపేట/ఆత్రేయపురం/పి.గన్నవరం/సఖినేటిపల్లి: పలు గ్రామాల్లో శుక్రవారం విద్యుత్ సరఫరాకు అంతరాయం కలగనుంది. ఏపీఈపీడీసీఎల్ అమలాపురం ఈఈ ఎం.రవికుమార్, పి.గన్నవరం ఏఈ ఆనందరాజు గురువారం వేర్వేరు ప్రకటనల్లో విషయం తెలిపారు.

- 33 కేవీ విద్యుత్ లైన్ పరిధిలో చెట్ల కొమ్మల తొలగింపు నిమిత్తం కొత్తపేట మండలం బిళ్లకుర్రు, వానపల్లి, అవిడి, మోడేకుర్రు, ఖండ్రిగ గ్రామాల్లో ఉదయం 9 నుంచి మధ్యాహ్నం 3 గంటల వరకూ విద్యుత్ సరఫరా నిలిపివేస్తున్నారు.
- ఆత్రేయపురం మండలం పేరవరం సబ్ స్టేషన్ పరిధిలోని గ్రామాల్లో 33 కేవీ లైను మరమ్మతుల నేపథ్యంలో ఉదయం 9 నుంచి మధ్యాహ్నం 2 గంటల వరకూ విద్యుత్ సరఫరాకు అంతరాయం కలగనుంది.
- పి.గన్నవరం మండలంలో కొత్తపేట నుంచి నరేంద్రపురం సబ్ స్టేషన్‌కు వచ్చే 11 కేవీ విద్యుత్ లైన్ మరమ్మతుల కారణంగా ఉదయం 8 నుంచి మధ్యాహ్నం 2 గంటల వరకూ విద్యుత్ సరఫరా నిలిపివేస్తున్నారు. ఆ సమయంలో పప్పులవారిపాలెం, నరేంద్రపురం, రాజులపాలెం, గుత్తులవారిపాలెం, ఆదిమూలంవారిపాలెం, ఊడిమూడి, ఊడిమూడిలంక, జి.పెదపూడి, జి.పెదపూడి లంక గ్రామాల్లో విద్యుత్ సరఫరా ఉండదు.
- సఖినేటిపల్లి మండలంలో చెట్ల కొమ్మల తొలగింపు పనుల కోసం ఉదయం 8 నుంచి మధ్యాహ్నం 2 గంటల వరకూ విద్యుత్ సరఫరాకు అంతరాయం కలగనుంది.

పరిఢవిల్లుతున్న సామాజిక చైతన్యం

- ఎమ్మెల్యే రాపాక వరప్రసాదరావు
- తాటిపాకలో గడప గడపకూ మన ప్రభుత్వం



తాటిపాకలో గడప గడపకూ కార్యక్రమంలో పాల్గొన్న ఎమ్మెల్యే రాపాక

రాజోలు: ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి సుపరిపాలనతో రాష్ట్రంలో సామాజిక చైతన్యం పరిఢవిల్లుతోందని రాజోలు ఎమ్మెల్యే రాపాక వరప్రసాదరావు అన్నారు. తాటిపాకలో ఆరో రోజైన గురువారం కూడా గడప గడపకూ మన ప్రభుత్వం కార్యక్రమాన్ని ఆయన నిర్వహించారు. పలు ప్రాంతాల్లో ఇంటింటికీ వెళ్లి ప్రభుత్వం అమలు చేసిన సంక్షేమ, అభివృద్ధి కార్యక్రమాలను వివరించారు. ఈ సందర్భంగా పలువురు కొన్ని సమస్యలు చెప్పగా వాటి పరిష్కారానికి చర్యలు తీసుకోవాలని సంబంధిత అధికారులను ఎమ్మెల్యే రాపాక ఆదేశించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ, మహిళలకు 33 శాతం రిజర్వేషన్లు అమలు చేసే బిల్లును పార్లమెంటు ఆమోదించిందని, అయితే సీఎం జగన్ నాలుగేళ్లుగా మహిళలకు 50 శాతం రిజర్వేషన్లు ఇస్తూ, నామినేటెడ్ పదవులు కూడా కేటాయించారని గుర్తు చేశారు. ఎస్సీ, బీసీ, మైనార్టీలకు రాజకీయంగా అధిక ప్రాధాన్యం ఇచ్చి సామాజిక న్యాయానికి పెద్ద పీట వేశారన్నారు. రాజోలు వ్యవసాయ మార్కెట్ కమిటీ చైర్‌పర్సన్ రోజారమణి, జెడ్పీటీసీ సభ్యురాలు మట్టా శైలజ, ఎంపీటీసీ కట్టా మోహన్‌కృష్ణ, సూర్యబలిజ కార్పొరేషన్ డైరెక్టర్ కోటిపల్లి ఎస్తేరు రాణి, క్రిస్టియన్ మైనార్టీ సెల్ జిల్లా అధ్యక్షుడు కనపాల బాబూరావు, వైఎస్సార్ సీపీ గ్రామ శాఖ అధ్యక్షుడు మెడబల రాజ్‌కుమార్, పార్టీ రాజోలు, సఖినేటిపల్లి మండలాల అధ్యక్షులు కట్టా శ్రీనివాసరావు, కుసుమ చంద్రశేఖర్ తదితరులు పాల్గొన్నారు.

ఆనందోత్సాహాలతో మిలాద్ ఉన్ నబీ



కొత్తపేట మసీదులో ప్రార్థనలు చేస్తున్న ముస్లింలు

కొత్తపేట/మామిడికుదురు/అంబాజీపేట: తమ ఆరాధ్య దైవం మహ్మద్ ప్రవక్త పుట్టిన రోజు మిలాద్ ఉన్ నబీ పండగను ముస్లింలు గురువారం ఆనందోత్సాహాలతో నిర్వహించారు. పరస్పరం ఆలింగనం చేసుకుని శుభాకాంక్షలు తెలియజేసుకున్నారు. మిలాద్ ఉన్ నబీ సందర్భంగా కొత్తపేట మండలం కమ్మిరెడ్డిపాలెం మసీదులో ఇమామ్ ఇంతియాజ్ అహ్మద్ ఆధ్వర్యాన ముస్లింలు ప్రత్యేక ప్రార్థనలు నిర్వహించారు. మత గురువు, పలువురు నాయకులు మాట్లాడుతూ, సర్వోత్తముడైన మహాప్రవక్త ప్రపంచ శాంతికి, సర్వ మానవాళి ఉన్నతికి మార్గం చూపిన మహనీయుడని అన్నారు. రాత్రి ప్రత్యేక ప్రార్థనల అనంతరం అందరూ సహపంక్తి విందు చేశారు. కార్యక్రమాల్లో మసీదు, షాదీఖానా కమిటీ అధ్యక్షుడు షేక్ ఖాజాబాబు, ముస్లిం నాయకులు షేక్ గౌస్, మహ్మద్ హరుణ్, షేక్ బడేమియా, షేక్ మక్బుల్ తదితరులు పాల్గొన్నారు. మండలంలోని వానపల్లి, పలివెల గ్రామాల్లోని మసీదుల్లో కూడా మహ్మద్ ప్రవక్త జన్మదిన వేడుకలు, ప్రత్యేక ప్రార్థనలు ఘనంగా నిర్వహించారు.

- మామిడికుదురు మండలంలో జాతీయ రహదారి మీదుగా వెళ్తున్న ప్రయాణికులకు డ్రింకులు పంపిణీ చేశారు. భక్తులకు అన్న సమారాధన ఏర్పాటు చేశారు. మామిడికుదురు సున్నీ జామియా మసీదును విద్యుద్దీపాలతో సర్వాంగ సుందరంగా అలంకరించారు. మసీదులో మత ప్రబోధకులు మహ్మద్ సాధిక్ అన్వర్ రజ్వీ మిలాద్ ఆలపించారు. కార్యక్రమంలో గౌస్ మొహిద్దీన్, మసూద్ మొహిద్దీన్, కిష్వర్ మొహిద్దీన్, ఎండీవై షరీఫ్ తదితరులు పాల్గొన్నారు.
- అంబాజీపేట మండలంలో ముస్లింలు శుభాకాంక్షలు చెప్పుకొన్నారు. మసీదులో ప్రత్యేక ప్రార్థనలు చేశారు.

మహాకవి జాషువాకు ఘన నివాళి



జాషువా జయంతిలో పాల్గొన్న కళా వేదిక ప్రతినిధులు

మామిడికుదురు: స్థానిక బోయి భీమన్న మానవ వనరుల కేంద్రంలో మహాకవి గుర్రం జాషువా 128వ జయంతి గురువారం ఘనంగా నిర్వహించారు. జాషువా చిత్రపటానికి అభ్యుదయ భీమ్ సాహిత్య కళా వేదిక ప్రతినిధులు పూలమాలలు వేసి నివాళులర్పించారు. సర్పంచ్ గౌస్ మొహిద్దీన్ పాల్గొని జాషువా సేవలను కొనియాడారు. కవులు పద్యాలు, గేయాలు ఆలపించారు. జాషువా వ్యక్తిత్వాన్ని కొనియాడారు. కళా వేదిక అధ్యక్షుడు డాక్టర్ పాలమూరి విక్రమ్ అధ్యక్షతన జరిగిన ఈ కార్యక్రమంలో ఉపాధ్యక్షుడు అప్పన రామకృష్ణ, గెయిల్ ఇన్‌చార్జ్ అధికారపు సురేష్ తదితరులు పాల్గొన్నారు.

తల్లీబిడ్డలకు శ్రీరామరక్ష

- సమతుల ఆహారంతో రక్తహీనత నివారణ
- అర్హులందరికీ వైఎస్సార్ పోషణ కిట్ల పంపిణీ
- రేపటితో ముగియనున్న పౌష్టికాహార మాసోత్సవాలు

ఆలమూరు: రాష్ట్రంలో వైఎస్సార్ సీపీ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తరువాత మాతా శిశు సంరక్షణకు ప్రత్యేక చర్యలు తీసుకుంటోంది. అనేక పోషక విలువలతో కూడిన సమతుల ఆహారాన్ని అందించి చిన్నారులు, బాలింతలు, గర్భిణుల్లో రక్తహీనత నివారణకు పటిష్ట చర్యలు చేపట్టింది. ఇందులో భాగంగా అంగన్‌వాడీ కేంద్రాల ద్వారా పది రకాల పోషక పదార్థాలతో కూడిన పౌష్టికాహార కిట్లు ఉచితంగా అందజేస్తోంది. జన్మనిచ్చిన తల్లితో పాటు జన్మించే పండంటి బిడ్డ కూడా సంపూర్ణ ఆరోగ్యంగా ఉండాలనే ఉద్దేశంతో వైఎస్సార్ సంపూర్ణ పోషణ పేరిట ప్రతిష్టాత్మకంగా ఈ కిట్లు అందజేస్తోంది.

నియోజకవర్గాల వారీగా వివరాలు

నియోజకవర్గం	అంగన్‌వాడీ కేంద్రాలు	గర్భిణులు	బాలింతలు
కొత్తపేట	285	1,823	1,674
రాజోలు	215	1,748	1,476
పి.గన్నవరం	198	1,649	1,648
మొత్తం	698	5,220	4,798

ఇప్పటి వరకూ అంగన్‌వాడీ కేంద్రాలకే పరిమితమైన పౌష్టికాహారాన్ని లబ్ధిదారులు మరింతగా వినియోగించుకునేందుకు వీలుగా ఐసీడీఎస్ ద్వారా ఇంటి వద్దకే (టీహెచ్ఆర్) అందిస్తోంది. అర్హులైన అందరికీ పౌష్టికాహారం అందించాలనే లక్ష్యంతో పాటు, పంపిణీ మరింత పారదర్శకంగా ఉండేందుకు వీలుగా ఎఫ్ఆర్ఎస్ విధానాన్ని ప్రభుత్వం ప్రవేశపెట్టింది. ఐసీడీఎస్ ఆధ్వర్యాన సెప్టెంబర్ 1న ప్రారంభమైన పౌష్టికాహార వారోత్సవాలు శనివారంతో ముగియనున్నాయి. ఇప్పటికే అన్ని మండల కేంద్రాల్లోనూ ఈ ఉత్సవాలు నిర్వహించి, పౌష్టికాహార ఆవశ్యకతపై గర్భిణులు, బాలింతలకు అవగాహన కల్పించారు. అత్యుత్తమ వంటకాలు తయారు చేసిన అంగన్‌వాడీ కార్యకర్తలకు బహుమతులు అందజేశారు.



పౌష్టికాహార మాసోత్సవాల్లో పాల్గొన్న అంగన్‌వాడీ కార్యకర్తలు



ఆలమూరులో వైఎస్సార్ పోషణ కిట్లను పంపిణీ చేస్తున్న ప్రజాప్రతినిధులు, అధికారులు

వైఎస్సార్ సంపూర్ణ పోషణ కిట్ల పంపిణీ ఇలా..

కొత్తపేట, రాజోలు, పి.గన్నవరం నియోజకవర్గాల పరిధిలోని మూడు ఐసీడీఎస్ కేంద్రాల పరిధిలో 852 అంగన్‌వాడీ కేంద్రాలున్నాయి. వీటిల్లో నమోదైన 7,694 మంది బాలింతలు, గర్భిణులకు ప్రతి నెలా టేక్ హోమ్ రేషన్ (టీహెచ్ఆర్) ద్వారా ఇంటికే పౌష్టికాహార వస్తువులు అందజేస్తున్నారు. వైఎస్సార్ సంపూర్ణ పోషణ ద్వారా ప్రతి నెలా బాలింతలు, గర్భిణులు ఒక్కొక్కరికి రూ.900 విలువైన పది రకాల వస్తువులు అందుతున్నాయి. వీటిలో ఐదు రకాల పౌష్టికాహార వస్తువులను రాష్ట్ర ప్రభుత్వమే ప్రత్యేకంగా పంపిణీ చేస్తోంది. దీనివల్ల ప్రతి నెలా అదనంగా రూ.18.82 లక్షల చొప్పున ప్రభుత్వం ఏటా రూ.2.33 కోట్ల మేర ఖర్చు చేస్తోంది.

ఇస్తున్న సరకులు

- ఫోర్టిఫైడ్ బియ్యం: 3 కేజీలు
- పామాయిల్: అర లీటరు
- కందిపప్పు: కేజీ
- కోడిగుడ్లు: 25
- పాలు: 5 లీటర్లు
- రాగి పిండి: 2 కేజీలు
- అటుకులు: కేజీ
- చిక్కీలు, ఖర్జూరం, బెల్లం: పావు కిలో చొప్పున